# అనువర్తి

'అమ్మా! ఈ బస్సుల దగ్గర ఎన్ని గంటలు పడికాపులు కాచినా పావలా డబ్బులు కూడా రావటం లేదమ్మా. పైగా ఈ ఎండలో నాతోపాటు నువ్వు కూడా మాడి పోతున్నావ్ తల్లీ!' చింకి చొక్కాతో నుదురు తుడుచుకుంటూ ప్రక్కనున్న పదేళ్ళ కూతురుతో అన్నాడు.

అతడు గ్రుడ్డివాడు. సంపాదించేందుకు అతనికి మార్గం బిచ్చమెత్తుకోవడమే. అతని సర్వస్వం ఆ ఒక్క కూతురే. భార్య పోయేటప్పుడు అప్పగించిపోయింది.

తండ్రి మాటలు విన్నది కూతురు.

'మరేం చేద్దాం అయ్యా! ఇంకెక్కడికన్నా పోతే ఈ నాలుగు డబ్బులు కూడా రావేమో' తన సందేహం వెలిబుచ్చింది.

వచ్చే పోయే బస్సులు, రద్దీ ఎక్కువ. తన కూతురు ఏమైపో తుందోనని ఆతని భయం. తనగురించి అతనికి చింతలేదు.

'అమ్మా! భగవంతుడు అంత దయలేనివాడనుకున్నావా. మన బోటి అనాథలకు ఆయనే గతి. మనల్ని కాపాడేది ఆయనేనమ్మా.

ఈ బస్సుల మధ్య నువ్వెలా తప్పుకు తిరుగుతావోనని నా భయం. ఇక యిక్కడ వద్దమ్మా. పైగా కారు హారన్ల మధ్య, మోతల మధ్య నా పాట నాకే వినపడడం లేదమ్మా'

'అది నిజమేనయ్యా! నీ పాట వినేవాళ్ళే ఇక్కడ కనిపించడం లేదు. అంతా హడావుడితో వచ్చి పోతుంటారు. జేబులో చెయ్యి పెట్టి నయాపైస దానం చెయ్యడానికి వారికి తీరుబాటే వుండదు.'

ఆనాడు తండ్రీ కూతుళ్ళు ఇల్లు చేరుకున్నారు. అది చిన్న గుడిసె. అందులో వున్నవి రెండు మూడు పాత కుండలు. చింకి యీతాకుల చాప. చినిగిపోయిన నాలు గయిదు బట్టలు. ఏ రోజు సంపాదనతో ఆ రోజు గడుస్తుంది వారిద్దరికీ. దొరికిన దానితోనే తృప్తి పడతారు. రేపటి చింతలేదు. ఉన్నా తీరడానికి మార్గం లేదు.

తండ్రిని విడిచి వుండడానికి వీలులేదు ఆ కూతురికి. తానుకూడా ఏమైనా సంపాదిస్తే బాగుండు ననుకుంటోంది. కానీ చిన్నతనం కూలి పని చేయలేదు. ఎవరింట్లోనైనా పిల్లల్ని ఆడించేపనికైనా కుదురుదామా అనుకుంటోంది. తండ్రితో యీ సంగతి యింతవరకు అనలేదు.

తండ్రి అలా బస్సు స్టాండు దగ్గర అరణ్యరోదనంలా పాడుతూ బిచ్చ మెత్తుకోవడం ఆమెకు ఇష్టం లేదు. తండ్రిని తా నెన్నటికైనా సుఖపెట్టగలనా అని అనుకుంది. అతడూ అంతే. తన బిడ్డ ఎప్పటికైనా సుఖపడే రోజులు వస్తాయా అనుకున్నాడు.

మర్నాడు తండ్రిని ఎక్కడికి తీసుకువెళ్ళడమా అన్నదే సమస్య అయింది ఆమెకు. అనేక స్థలాలను గురించి వరసగా ఆలోచిస్తోంది. ఆంజనేయస్వామి గుడి దగ్గర చాలా చక్కగా వుంటుందనుకుంది.

అక్కడే బజారుంది. కూరగాయల మార్కెటుంది. ఒత్తుగా చెట్లున్నాయి. చక్కటి నీడ, పందిరి వేసినట్లు వుంటుంది. అక్కడైతే అటూ యిటూ తిరగక్కరలేదు. ఒకచోట కూర్చుని పాడుకుంటూ వుంటే దయపుట్టిన మహరాజులు ఒకపైస వేసిపోతారు.

ప్రొద్దున్నే తండ్రితో అంది 'ఇవ్వాళ మనం ఇంకోచోటుకి వెళ్దాం అయ్యా'.

'అలాగే నమ్మా'. ఎక్కడ కని అడగలేదు.

'మరీ మంచిదమ్మా! మన మొర ఆ స్వామికైనా వినిపిస్తుంది' అన్నాడు.

మిగిలిన చద్దిమెతుకులు తిన్నారు.

తండ్రి తన తంబుర పుచ్చుకున్నాడు. కూతురు కర్ర అతని చేతి కందించింది.

ఆంజనేయస్వామి గుడి దగ్గరికి చేరుకున్నారు. చల్లగా వుంది చెట్లనీడ.

'చాలా చల్లగా వుందమ్మా యిక్కడ' అన్నాడు.

'అవునయ్యా! అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను'

ఒక చెట్టుక్రింద నేల శుభ్రంగా తుడిచి వెంట తెచ్చిన పాత బట్ట పరిచింది. తండ్రిని దానిమీద కూర్చోబెట్టింది.

అతడు తంబుర సరిచేసుకున్నాడు.

అతని కంఠం కమ్మగా వుంటుంది. పాడుతున్నప్పుడు వినే వాళ్ళకు నిజంగా భగవంతుడు కళ్ళకు కట్టినట్టే వుంటాడు. అవును. అతను లోకాన్ని కాక భగవంతున్నే చూస్తూ పాడతాడు.

'అమ్మా నువ్వెందుకిక్కడ. వెళ్ళు. ఎండెక్కినాక ఒకసారి రా తల్లి.' అన్నాడు.

'ఒక్కడివే వుంటావా అయ్యా' అంది ఒక్కణ్ణే విడిచిపోవడానికి యిష్టంలేక.

'నాకు భయమేమిటి తల్లీ. ఆ రాముడు ఎప్పుడు నా వెంటే వుంటాడు. నేనింక కదలక్కర్లేదు. కాసేపయ్యాక వద్దువుగాని'

నిజమే, తానుపుండి చేసేదేముందనుకుంది ఆమె. అదీగాక యివ్వాళ రొట్టెలు చేయలేదు. ముంతలో కొంచెం జొన్నపిండి వున్నట్టు జ్ఞాపకం. రొండు రొట్టెలయితేచేసి తండ్రికి తెచ్చి పెడదామనుకుంది. చద్ది మెతుకులు చెరి నాలుగు ముద్దలుకూడా రాలేదు.

ఉదయం తండ్రి ముంతడు నీళ్ళు మాత్రం త్రాగి వూరికేత్రేన్నాడు ఆమె తృప్తికోసం.

'జాగ్రత్తయ్యా! మళ్ళీ వస్తా కాసేపయ్యాక' అని ఆమె వెళి పోయింది వెనక్కితిరిగి చూసుకుంటా.

అతడు కంఠం సరిచేసుకుని పాట మొదలెట్టాడు తంబుర మీటు కుంటూ. రాముని కీర్తిస్తున్న పాట అది. మధురంగా వుంది. అటు వెళ్ళే వారు ఒక్కక్షణం ఆగి పాట వినేటట్లు చేస్తున్నది అతని కంఠం. బుద్ధి పుట్టిన వారు ఒక పైస వేస్తున్నారు.

ఇంతలో అక్కడికి కుంటివాడొకడు వచ్చాడు. మనిషి ఏమంత బలహీనంగా లేడు. ఒక కాలుకుంటి. చేతిలో కర్రవుంది. దూరాన్నుంచే చూశాడు చెట్టు క్రింద మరెవరో బిచ్చగాడు వుండడం.

గ్రుడ్డివాడి దగ్గరికి వచ్చాడు.

"ఎవరయ్యా నువ్వు" కోపం కక్కుతూ అడిగాడు. అందులో అధికారం వుంది— ఖామందు అడిగినట్టుగా.

పిడుగులా పడ్డాయి ఆ మాటలు గ్రుడ్డివాడి చెవిలో. తననో కాదో అనుకున్నాడు.

పాట స్థాయి తగ్గించాడు.

మారు పలక్కుండా పాట పాడుతుండడం చూసి మరింత మండి పడ్డాడు కుంటివాడు.

"ఓయ్! నిన్నే.... చెవులుకూడా లేవా? ఎవరు నువ్వు' చీదరించు కున్నాడు.

తననే ప్రశ్నిస్తున్నట్లు రూఢి అయ్యింది.

'రెండు కళ్ళులేని కబోదిని బాబు. నాపేరు రంగస్వామి. వినయంతో చెప్పాడు. తనని అలా అడుగుతున్నది ఎవరో తెలియదు అతనికి. 'మీరెవరు బాబు?' అని అడిగాడు తెలుసుకుందామని.

కుంటివాడికి తోకత్రొక్కినట్లయింది. సమాధానం నచ్చలేదు.

"చూడు! నీ పేరు పూర్లు అడగడంలేదు. ఇక్కడికి ఎలావచ్చావ్.'

'నా కూతురు తీసుకొచ్చింది.'

కుంటివాడికి కావలసిన జవాబు అది కాదు.

'ఎవరు తీసుకొస్తే ఎవరిక్కావాలి. అసలు ఈ చోట్లో ఎలా బైఠాయించావంట?' కఱ్ఱ నేలకేసికొడుతూ అడిగాడు.

ఈ ధోరణి రంగస్వామికి అర్థంకాలేదు. అన్ని ప్రశ్నలు వేస్తున్న దెవరో కూడా తెలియటంలేదు.

'ఏం బాబూ ఇక్కడ ముష్టివాళ్ళు కూర్చోకూడదా?'

'మహారాజులా కూర్చోవచ్చు. కాని రోజూ నేను కూర్చొనే చోటు అది.'

అసలు సంగతి అర్థమయ్యింది. వచ్చినవాడు తనతోటి బిచ్చగాడని తెలుసుకున్నాడు.

చిరునవ్వు నవ్వాడు.

అలా నవ్వడం కుంటివాడికి యిష్టం లేదు. పైగా వేళాకోళం చేసినట్లుంది.

'నిన్నే అక్కణ్ణుంచి కదులు' ఆజ్ఞాపించాడు.

'గ్రుడ్డివాణ్ని బాబూ! ఎక్కడికి పోతాను. నా కూతురు వచ్చాక వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోతాను. అందాక కూర్చోనీ బాబు' బ్రతిమాలాడాడు.

కుంటివాడు వినిపించుకోలేదు.

'మర్యాదగా చెప్తే కదిలేటట్లులేవ్!' అంటూ రెక్కపుచ్చుకొని రంగస్వామిని అమాంతంగా లేవదీశాడు.

అటు పోయే వాళ్ళు దౌర్జన్యం చూశారు.

కుంటివాడి అహంకారం వాళ్ళు సహించలేకపోయారు. వచ్చి రెక్క విడిపించారు. అందులో ఒకాయన 'ఏయ్ నీకేమన్నా బుద్ధుందా. నీ తాతగాడి సొమ్ములా మాట్లాడుతున్నావ్? గ్రుడ్డివాడనన్నా చూడ కుండా అలా చెయ్యి పుచ్చుకొని గుంజుతున్నావ్? నువ్వు మనిషివా పశువ్వా?' కోపంతో అన్నాడు.

కుంటివాడు జంకాడు.

'అది కాదు బాబయ్యా! ఎంతకాలం నుంచో నేనిక్కడే కూర్చుని అడుక్కుతింటున్నాను. ఇవ్వాళ రావడం కాస్త ఆలస్యమయ్యిందండి ఇంతలోకే యీయనొచ్చి కూర్చుండిపోయాడు' నిమ్మదిగా చెప్పాడు.

'ఓస్! ఇంతేకదా! ఇక్కడ బోలెడంత జాగావుంది. ధర్మంచేసే వాళ్ళుండాలిగాని ఎక్కడ కూర్చుంటే ఏముందోయ్— అయినా నీజాగాలో నువ్వే కూర్చో. ఇతనే ప్రక్కగా కూర్చుంటాడు.'

పాపం ఆయనే ప్రక్కన నేల కాలితో తుడిచి ఆ బట్ట పక్కకు లాగాడు. రంగస్వామిని దానిమీద కూర్చోపెట్టాడు.

'దండంబాబూ! దేవుడు మీకు మేలు చేస్తాడు.' రంగస్వామి కృతజ్ఞత తెలుపుకున్నాడు.

ఆయన వెళ్తూ కుంటివాడితో 'జాగ్రత్త! అతణ్ణింకేమి చేయకు కళ్ళులేనివాడు. చేతనైతే ఏదైనా సహాయం చెయ్యి' అని హెచ్చరించాడు.

కుంటివాడూ, రంగస్వామీ కూర్చున్నారు.

రంగస్వామి తంబుర సరిచేసుకున్నాడు.

'బాబూ! నావల్ల తప్పయితే క్షమించు. నా కూతురు తెలియక

కూర్చోపెట్టింది, తెలిస్తే నీ జాగాలో ఎందుకూర్చుంటాను' అన్నాడు కుంటివాడితో స్నేహం కలపాలని.

అతనికి కోపం తగ్గలేదు.

జవాబు చెప్పలేదు.

గిన్నె చప్పుడు చేస్తూ 'కుంటివాణ్ని బాబయ్యా! దిక్కులేని వాణ్ని.... ఒకపైసా దానం చేయండి పుణ్యాత్ములు' అని తన మామూలు ధోరణిలో అరవడం ప్రారంభించాడు. ఆ అరుపు చాలా దూరం వినపడుతుంది.

మూడుసార్లు అరచి కాసేపు ఆగాడు.

'నీ పేరేమిటి బాబూ! ఎక్కడుంటావ్' అని తిరిగి అడిగాడు రంగస్వామి.

వదిలేటట్లు లేడనుకున్నాడు.

చిరాకు పడ్డాడు.

'కిష్టప్ప నా పేరు. ఎక్కడుంటే నీకెందుకు. ఎట్టో వుంటాను' కసిరాడు.

'ఎంత చక్కటి పేరు. కిష్టయ్య పేరు దేవుడి పేరు.' మెచ్చుకున్నాడు.

కాని ఆ మాటలు కిష్టప్ప అరుపులో కలిసిపోయాయి.

రంగస్వామి సూరదాసు భజన గీతం ఒకటి ఎత్తుకున్నాడు. శ్రావ్యంగా వుంది. భక్తిపారవశ్యంతో పాడుతున్నాడు. క్రిందపరచిన బట్టమీద డబ్బులు పడుతున్నాయి.

కిష్టప్పకి కన్నెర్రగా వుంది. అతడి గిన్నెలో అంతగా డబ్బులు పడడంలేదు. గట్టిగా అరుస్తున్నాడు 'కనికరించదయ్యా కాళ్ళు లేనివాడిని అవిటివాణ్ని బాబూ ధర్మప్రభువులు దయగల తల్లులు' అని.

అందరి దృష్టి రంగస్వామి వైపుకే మళ్ళుతున్నది.

ఎండ ఎక్కుతున్న కొద్దీ జనం తగ్గుతున్నారు. రంగస్వామి కూతురు రాలేదేమీ అని ఆలోచిస్తున్నాడు.

పాట అపుచేశాడు.

కిష్టప్ప మాత్రం అరుపు మానలేదు. అతనికి యింకా కోపంగానే వుంది. తనకి గిట్టుబాటు కాకపోవడానికి కారణం యీ రంగస్వామే అనుకున్నాడు.

'కిష్టప్ప బాబూ నా కూతురేమైన వస్తున్నదా అని అడిగాడు తన ఆవేదన కొద్దీ.

వికృతంగా నవ్వాడు కిష్టప్ప.

'ఎవడికి తెలుసయ్యా నీ కూతురెవరో' నిజమేననుకున్నాడు రంగస్వామి.

'పదేళ్ళుంటాయి బాబు' అన్నాడు వుండబట్టలేక.

'ఏమో? ఎవడికి తెలుసు. వస్తే యిక్కడికి రాదా! అంత కంగారు పడతావేం' యీసడించుకున్నాడు.

'తల్లిలేని పిల్లబాబూ! నాకు దిక్కదే' అన్నాడు కళ్ళు చెమ్మగిల్లాయి.

తిరిగి ఎవరూ మాట్లాడలేదు.

కాసేపటికి కూతురు వచ్చింది.

'వచ్చావా తల్లీ! నీ కోసమే చూస్తున్నా'

కిష్టప్ప ఆమె వంక చురచురా చూశాడు. ఆమె భయపడింది.

'ఇదుగో అయ్యా రొట్టెలు' అందించింది రెండు.

'ఇప్పుడు చేశావా అమ్మా!.... చూడమ్మా ఒక రొట్టె యీ మామకు ఇవ్వమ్మా' అన్నాడు ఎంతో ఆప్యాయతతో.

ఆమె ఇవ్వబోయింది.

కిష్టప్ప పుచ్చుకోలేదు. 'అక్కర్లా! తినే వచ్చాలే' బెట్టుచేశాడు.

'తీసుకో బాబూ' బ్రతిమాలుతూ చెప్పాడు రంగస్వామీ.

'వద్దంటే!' చెయ్యి తోసేశాడు.

లాభం లేదనుకున్నాడు. 'రామ్మా! తిందాం. రంగస్వామి, కూతురూ చెరొకటి తిన్నారు. తండ్రికి పంపుదగ్గర్నుంచి మంచినీళ్ళు తెచ్చియిచ్చింది.

'కిష్టప్పబాబూ! నా కూతురు, శాంత' అన్నాడు కూతురు తల నిమురుతూ

'ఉఁహూ' కిష్టప్ప మూలిగాడు.

శాంత తండ్రి దగ్గర కాసేపు కూర్చుంది. తండ్రితో ఒకసంగతి చెప్పడానికి బిడియపడుతున్నది.

'అయ్యా! మనయింటి ఎదురుగా మేడలో వాళ్ళు పిల్లని ఆడించ మన్నారయ్యా, నెలకు నాలుగు రూపాయలిస్తారట. నిన్నడిగి చెస్తా నన్నాను' అంది.

'ఏమిటితల్లీ! నువ్వు కొలువు చేస్తావా?'

'ఏం అయ్యా చేస్తే - ఎండప్పుడే ఆడించాలట'

సరేనన్నాడు కూతురు ఇష్టప్రకారం.

కూతురు తెలివితేటలకు సంతోషించాడు.

'ఇంక వెళ్ళమ్మా! సాయంకాలం వచ్చి యింటికి తీసుకుపో'

కూతురుకు కొన్ని డబ్బులు ఇచ్చి పంపాడు.

కిష్టప్పకు కంపరంగా వుంది.

రోజూ కన్నా తనకి చాలా తక్కువ వచ్చింది. రంగస్వామి మేను వాల్చాడు. చిన్న నిద్రపట్టింది.

నాలుగు గంటలయ్యింది లేచాడు. ముంతలో వున్న నీళ్ళు తాగాడు.

జనం సందడి హెచ్చింది.

కిష్టప్ప తిరిగి అరుపులు ప్రారంభించాడు.

రంగస్వామి రామనామ కీర్తన మొదలు పెట్టాడు.

కూరల మార్కెట్టుకూ, గుడిలోకీ వచ్చేజనం ఎక్కువయ్యారు.

ఎవరికి తోచిన ధర్మం వాళ్ళు చేస్తున్నారు. కిష్టప్ప రంగస్వామి బట్ట వంక చూశాడు. డబ్బులు చూసి కన్నుకుట్టింది. తన గిన్నె వంక చూసుకున్నాడు. పళ్ళు పటపటమనిపించాడు. తల పంకించాడు.

అటూ యిటూ ఎవ్వరూ తమ వంక చూడనప్పుడు రంగస్వామి దగ్గర్నుంచి చేతికందినవి కాజేస్తున్నాడు.

అతని మనస్సు కుదుటపడింది.

ప్రొద్దు కుంకింది.

శాంత వచ్చింది 'అయ్యా ఇక వెళ్దామా?'

'అలాగేనమ్మా'

శాంత పైసలన్నీ పోగుచేసి తండ్రి చేతిలో పోసింది.

'చూడమ్మా తల్లీ! అసలిక్కడ కూర్చుంటున్నది యీ మామ. మన మూలంగా యివ్వాళ మామకు డబ్బులు సరిగ్గా దొరకలేదు. సగం మామకిద్దాం' సగం తీసి కూతురు కిచ్చాడు "మామకియ్యమ్మా"

శాంత యిచ్చింది. కిష్టప్ప ఆశ్చర్యపోయాడు. ఎక్కడికో పాతాళానికి కుంగిపోతున్నట్లనిపించింది ఆ డబ్బులు తీసుకుంటున్నప్పుడు. తీసుకున్నాడు.

నెత్తిమీద ఎవరో కొట్టినట్లయింది. మనస్సులో కొత్త వెలుగులు వ్యాపించినట్లయింది. తన నిజస్వరూపం కళ్ళకు కట్టింది. తనమీద తనకే రోత పుట్టింది. రంగస్వామి ఎంత మంచివాడో తెలుసుకోగలిగాడు. తాను చేసిన ద్రోహానికి మారు ఎంతదయ చూపుతున్నాడు.

కిష్టప్పలో దాగి వున్న మంచి మనిషి పైకి వచ్చాడు. తనను ఆవరించి వున్న రాకాసి మనిషి పారిపోతున్నట్లనిపించింది కిష్టప్పకు.

కిష్టప్పకి నోటమాట రాలేదు.

కళ్ళలో నీరు నిండింది.

'వద్దుకోడలా! నేను పాపిష్టివాణ్ని—' మాటపూర్తి చేయలేక పోయాడు.

'అదేం కిష్టప్ప అలా మాట్లాడుతున్నావ్'

'రంగస్వామి ఇకనుంచి మనం బావామరదులం. నన్ను మనిషిని చేశావ్. ఇక ఇక్కడే కలిసి వుందాం. నువ్వు, శాంత మా యింటి కొచ్చేయండి'

"ఎందుకులేబాబూ" అర్థంకాక అన్నాడు రంగస్వామి.

ఈ బంగారుబొమ్మని నేను నిజంగా కోడలుగా చేసుకుంటాను బావా! నా కొడుకు శాంతకు ఈడైనవాడే. ఇవ్వాళ మా యింటికి పోదాం.

రంగస్వామి ఆనందంతో పులకించిపోయాడు. ఎంత చల్లనిమాట చెవిని పడింది.

'పద బావా వెళ్దాం'

ముగ్గురూ కిష్టప్ప యింటివైపు నడిచారు. *

(1963)